

# ఈ తరం అమ్మాయి

- అడివి సూర్యకుమారి

"ఎందుకు ఇంత ఆలస్యమైంది?" వాకిట్లోనే నిలవేసింది పార్వతమ్మ దుర్గని.

"ప్రైవేటు క్లాసుంది" సమాధానం చెబుతూనే లోపలికొచ్చింది దుర్గ.

"ఏం ప్రైవేటో! ఏం క్లాసో! ఒక్కరోజు టైముకి ఇంటికి రావు కదా!"

"ఉద్యోగం చేసేవాళ్ళయితే ఠంచనుగా నువ్వన్నట్లు టైమ్‌కింటి కొస్తారు. నీ కూతురు ఉద్యోగస్థురాలు కాదే! కాబోయే ఐ.పి.ఎస్. ఆఫీసర్. కోచింగ్ క్లాసుల కెళ్తున్నానమ్మా! రెండు నెలల్లో ఎంట్రన్స్ ఎగ్జామ్స్" అంది తల్లి ఇచ్చిన టిఫిన్ ప్లేటు అందుకుంటూ.

ఆవిడ మొహం తిప్పి, సీరియస్‌గా భక్త చింతామణి చదువుతూన్న భర్త శంకర్రావ్‌ని చూస్తూ -

"ఏమిటి నిజంగా దానిచేత ఐ.పి.ఎస్. రాయిస్తారా?" అంది.

"రాయించడానికిదేమైనా ఇప్పుడే బలపం పుచ్చుకున్న పిల్లేమిటి? నా కూతురు ప్రాజ్ఞురాలు. అది ఏం చదవాలనుకుంటే అది చదువుతుంది, చదివిస్తాను. ఈ డొంక తిరుగుడు దేనికి పార్వతీ! దాని పెళ్ళి విషయం అడగాలనుకున్నావ్, నాకు తెలుసు. అయినా దాని పెళ్ళి దానిష్టం. నేను పిల్లల ఇష్టానికే ప్రాముఖ్యమిస్తాను."

పార్వతి ఓ సెకన్ భర్త మొహంలోకి చూసి విస విస లోపలికెళ్ళింది.

"కొంచెం డోస్ మోతాదు మించిందేమో!" అంది దుర్గ వెళ్తూన్న తల్లిని చూస్తూ గొంతు తగ్గించి.

"ఫర్వాలేదు. ఆ మాత్రం ఇవ్వకపోతే నన్నూ నిన్నూ కూడా నీకు పెళ్ళి చూపులంటూ ప్రాణం తీస్తుంది." అన్నాడాయన కూతురివైపు ప్రేమగా చూస్తూ.

"థాంక్యూ డాడ్."

అంటూ తన గదిలోకి వెళ్ళింది,

రెండు నెలలు గడిచాయి.

ఓరోజు సాయంకాలం దుర్గ చిన్నన్న బలరాం 'అమ్మా' అంటూ పెద్దగా అరుస్తూ లోపలికొచ్చాడు.

"ఏమిట్రా ఆ పొలికేకలు! కాస్త మెల్లగా పిలవరాదూ!" అంది పార్వతి.

బలరాం వంటింట్లో పనిచేసుకుంటూన్న పార్వతికెదురుగా నిలబడి -

"రోజూ దుర్గ వెళ్తోంది కోచింగ్ క్లాసులకి కాదమ్మా"

ఆవిడ కొడుకు వైపు తిరిగి,

"కాదా! మరెక్కడికి?" అంది ఆశ్చర్యంగా చూస్తూ.


"ఎవరో ఒకాయన దగ్గరికెళ్తోంది. సాయంకాలం నుండి ఏడు గంటల దాకా ఆయన దగ్గరే వుండి వస్తోంది."

"నోర్మూయ్... ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నావో! నీకసలే ఛత్వారం. వారం రోజుల్లో ఎగ్జామ్స్ వచ్చాయని పిల్ల ఎంత హైరానాగా చదువుతోందో! మొద్దు వెధవ్వి నీకేం తెలుసు!" కోపంగా అంది పార్వతి. బలరాం డిగ్రీ కంపార్ట్‌మెంటల్‌గా పాసయ్యాడు.

"నే చెప్పేది నిజమమ్మా! నీమీదొట్టు. నేను దాని మీద పితూరీలెందుకు చెబుతాను! అసలక్కడే నాలుగు కడిగేద్దామనుకున్నా! నలుగురూ వింటారని కామ్‌గా వచ్చేశా."

పార్వతి నిర్ఘాంతపోయింది కొద్ది క్షణాలు.

"ఏమిట్రా నువ్వు.... నువ్వు చెప్పేది నిజమేనా?"



"నీమీదొట్టు వేశాగ్గూడా నా మాట నమ్మవా? శ్యాం వాళ్ళ మేడమీద నేనూ వాడూ నిలబడ్డాం. వాళ్ళింటి ఎదిరింట్లోనే ఇది పనిచేస్తోంది. వాళ్ళ పెరడంతా కన్పిస్తూనే వుంటుంది మేడమీద నిలబడితే. ఇది గిన్నెలు కాఫీ కప్పులు కడిగి లోపల పెట్టింది. బట్టలారేసింది. ఓ అరగంట తర్వాత బ్యాగు పట్టుకెళ్లి కూరగాయలు తెచ్చింది. తర్వాత నేను గంటసేపు నిలబడ్డాను. మళ్ళీ బైటికి రాలేదు. నన్ను చూడలేదనుకో."

పార్వతి వంటింటి గట్టు ఆసరాగా పట్టుకొని నిలబడింది.

"ఏమిటిది? నా పిల్ల! ఇంత నీచంగా ప్రవర్తిస్తోందా?"

పార్వతి ఆలోచనలు తనకే భయం కలిగించ సాగాయి.

రోజులా దుర్గ ఆ రోజూ ఎనిమిది గంటల కింటికొచ్చింది.

తల్లి తండ్రి అన్నయ్యలు అంతా తన రాక కోసమే ఎదురుచూస్తున్నట్లు వరండాలోనే కూర్చొని చాలా ఆత్రంగా చూస్తున్నారు.

లోపలికొచ్చి, చెప్పులు విప్పి, "ఏమిటమ్మా ఏమిటి నాన్నా, అట్లా కూర్చున్నారూ? ఎవరైనా ఇంటి కొస్తున్నారా" అంటూనే లోపలి కొచ్చింది దుర్గ.

మొహం కడుక్కోడానికై పెరట్లోకిపోబోతున్న దుర్గ భుజం మీద చెయ్యి పడటంతో తల వెనక్కి తిప్పింది. ఆ చెయ్యి తల్లిది.

ఆమె ముఖంలో రోజూ తన ఆలస్యానికి భయం, వేళపట్టున సరిగా తినటం లేదన్న ఆందోళన, ప్రేమ వాటిని దాచేస్తున్న తెచ్చిపెట్టుకున్న కోపం.... ఇవన్నీ కన్పించేవి.

కానీ.... ఈ రోజు ముఖంలో ఏదో మార్పు! ఏమిటిది? ఎందుకింత కాఠిన్యం?

"ఏంటమ్మా?" మృదువుగా అడిగింది దుర్గ. ఆవిడ దుర్గని విసురుగా తనవైపు తిప్పుకుంది. తనకంటే మూరెడు ఎత్తున్న కూతుర్ని భుజాలు పట్టి వంచింది.

"నిజం చెప్పు! నువ్వు రోజూ వెళ్తోంది సాయంకాలాలు కోచింగ్ క్లాసులకేనా? నువ్వు రెండు నెలలుగా సరిగ్గా రావటం లేదని మీ చంద్రం మాస్టారు పది నిముషాల కిందటే వచ్చి చెప్పి వెళ్ళాడు! నిజం చెప్పు? ఎక్కడ తిరిగొస్తున్నావ్?"

దుర్గ మాట్లాడకుండా తల్లినే చూస్తోంది. "పాపిష్ఠిదానా! నువ్వెంతో అభివృద్ధిలోకొస్తావని పెద్ద పోలీసాఫీసరువౌతావని నేనూ మీ నాన్న ఎన్నో ఆశలు పెట్టుకన్నాం. అవన్నీ మట్టిపాల్చేశావు గదే! నిజం చెప్పు! సాయంకాలాలు ఎవడితో గడిపొస్తున్నావ్? ఎంతకాలం నుండి సాగుతోందీ నాటకం? అంత వాడంటే పడి చచ్చేదానివి మాకు చెప్పొచ్చుగా! వాడికే ముడిపెట్టే వాళ్ళం. ఈ చదువులు ఈ ఖర్చంతా దేనికి?" ఆవేశంగా అడుగుతోంది పార్వతి.

"నువ్వాగు పారూ! దుర్గా! ఎవరమ్మా అతను?" అడిగాడు శంకర్రావ్ మెల్లగానే. దుర్గ తండ్రివైపొక సారి చూసి చిన్నగా నవ్వింది.

"రేపు సాయంకాలం ఆయన్ని మీకు పరిచయం చేస్తాను నాన్నా! ఇప్పుడు బాగా అలసటగా వుంది. మిమ్మల్ని తీసుకు వెళ్ళలేను. చదవాల్సినవి చాలా వున్నాయి" అని లోపలికెళ్ళిపోయింది ఠీవిగా.

ఏమాత్రం భయమూ, బెరుకూ, నిజం బైట పడ్డదన్న అవమానం ఆమె ముఖంలో మచ్చుకూడా లేవు. మీదు మిక్కిలి ఎప్పటిలా ఆమె ముఖాన్ని తేజోమయం చేసే ఆ చిరునవ్వు అలాగే వుంది.

పార్వతిని మరేమీ అనొద్దని చెప్పాడు శంకర్రావ్.

"మీరిచ్చిన అలుసే ఇలా కొంప ముంచేలా చేసింది. ఆడపిల్లని హద్దుల్లో వుంచాలనే నా మాట మీద మీకు లెఖ్ఖ లేదు" కోపంగా అంటోంది పార్వతి. శంకర్రావు విచికిత్సలో పడ్డాడు.

దుర్గ తనే అన్నం పెట్టుకొని తిని తన గదిలో కెళ్ళింది. రాత్రి రెండు దాటిందామె పుస్తకాలు మూసి మంచం మీదికి చేరేసరికి. ఈలోపల నిద్రపట్టని తండ్రి రెండుమార్లు ఆమె గదిదాకా విషయం అడగాలని వచ్చి ఆమె ఏకాగ్రత చూసి డిస్టర్బ్ చేయటం ఇష్టం లేక వెనక్కి వెళ్ళిపోయాడు.

దుర్గ తప్ప ఆ యింట్లో ఆ రాత్రి అంతా జాగారం చేశారు. మర్నాడు సాయంకాలం దాకా గడవడానికి వారికి అనేక యుగాలు పట్టినట్లయింది.

దుర్గ మామూలుగా నాలుగు గంటలకి బైటికెళ్ళింది. ఓ గంట తర్వాత ఇంటి ముందు ఆటో ఆగింది. దాదాపు అరవై ఏళ్ళున్న వ్యక్తి దిగడానికి సాయం పడుతోంది దుర్గ. అతను చేతి కర్రలు చేతికందించింది. అతనుకర్రల సాయంతో, దుర్గ ఆసరాతో లోపలికొస్తున్నాడు.

"ఇదేమిటి? కుర్రాడి తండ్రిని తీసుకొస్తోందా?" పైకే అనేసింది పార్వతమ్మ.

నున్నని పాలిష్ బండల మీద కర్ర జారింది. ఆయన పడబోయాడు. అప్రయత్నంగా శంకర్రావే చెయ్యి ఊతగా యిచ్చి ఆయన్ని నిలబెట్టాడు.

"థాంక్యూ జెంటిల్‌మేన్" అన్నాడాయన.

దుర్గ ఆయనకు కుర్చీను కర్చీ చూపుతూ, "వీరు మా నాన్న శంకర్రావు గారు. సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్. మా అమ్మగారు, మా పెద్దన్నయ్య డాక్టర్ ఉస్మానియాలో. మా చిన్నన్నయ్య ఎం.ఎస్.సీ. ఫైనలియర్."

అందరినీ చిరునవ్వుల్తో చూస్తూ చేతులు జోడించాడాయన.


తండ్రివైపు తిరిగి, "నాన్నా! వీరు రాజారాం గారు. రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్. పాకిస్తాన్‌తో జరిగిన వార్‌లో ఆయన కాళ్ళు పోయాయి. ఈయనకి పధ్నాలుగు భాషలొచ్చు. నేను బెంగాలీ నేర్చుకుంటున్నా."

ఇంకా ఏదో చెప్పబోతున్న దుర్గ మాటల్ని కట్ చేస్తూ - "అయితే మా అమ్మాయి రోజూ వెళ్లేది..." ఆపాడు శంకర్రావు.

"నా దగ్గరకే వస్తోంది. అందరూ వుండి ఎవరూ లేని వాడిలా బతికే నా చీకటి జీవితంలో దుర్గ ఓ కాంతి కిరణం."

"అంటే..." ఆగాడు బలరాం.

"ఓరోజు సాయంకాలం నేను షాపు నుండి వస్తున్నాను. ఓ యువకుడు స్కూటర్ మీద రాష్‌గా వెళ్తూ నాకు డ్యాష్ యిచ్చి ఆగకుండా వెళ్ళిపోతున్నాడు. దుర్గ ఆ దారినే వస్తోంది. నన్ను లేవదీసి, వెహికల్ మీద పోతున్న కుర్రాణ్ణి వెంబడించి, జుట్టు పట్టుకొని లాక్కొచ్చి నా ముందు పడేసింది. నలుగురి చేతా వాణ్ణి ఛీ కొట్టించి, నాకు తగిలిన దెబ్బలకి డాక్టరు ఫీజు వాడిచేత ఇప్పించి మరీ వదిలి పెట్టింది. ఆ క్షణంలో దుర్గ నా కళ్ళకు రియల్ హీరో అన్పిం



## సౌందర్య పోటీలు

ప్రపంచంలో మొట్టమొదటిసారిగా 1826 సౌందర్య పోటీలు గ్రీస్ దేశంలో జరిగాయి. 1921లో అమెరికాలో ప్రారంభమయ్యాయి. మిస్ వరల్డ్ పోటీ మొదటిసారిగా 1951లో జరిగింది. భారతదేశంలో సౌందర్య పోటీలు మొదటిసారిగా 1952లో జరిగాయి.

## జన సాంద్రత

ప్రపంచం మొత్తం సగటున ఏటా 7 - 8 కోట్ల మంది కొత్తగా పుడుతున్నారు. ఈవిధంగా జనాభా పెరిగిపోతూ వుంటే వివిధ అంచనాల ప్రకారం 2000 సంవత్సరానికి ప్రపంచ జనాభా 640 కోట్లు దాటుతుంది. ప్రపంచ జనాభా నేడున్న రేటులో పెరిగిపోతూ వుంటే 2600వ సంవత్సరానికి ఈ భూమిపై ప్రతి మనిషికి ఒక చదరపు గజం స్థలం మాత్రమే మిగులుతుందట.

- డా॥ ఎ.ఎల్.ఆర్.మూర్తి

చింది. 'ఈ తరం అమ్మాయి' ఇలా ఉండాలి అనిపించింది. ఆ అమ్మాయిని చూసిన మరుక్షణం నుండి నా బాధంతా మరిచిపోయాను. అలా అయింది మా పరిచయం" అన్నాడాయన.

"మరి రోజూ దుర్గ..."

"రోజూ నాలుగ్గంటల నుండి రాత్రి ఏనిమిది గంటల దాకా నాదగ్గరే ఉంటోంది. నాకు వండి పెట్టి కబుర్లు చెప్పి వెళ్తుంది. వద్దంటే వినదు. మంచి ఏకసంతగ్రాహి. ఇట్టే బెంగాలీ నేర్చేసుకుంది. నిజం చెప్పాలంటే మా ఇద్దరిదీ ఈ జన్మబంధం కాదేమోననిపిస్తుంది నాకు. దుర్గ రావడం కాస్త ఆలస్యమైతే నా ప్రాణం కొట్టుకుపోతుంది."

"మరి మీవాళ్ళూ..." ఆగింది పార్వతి.

"ఉన్నారమ్మా! అంతా ఉన్నారు. భార్యా, ముగ్గురు కొడుకులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్ళు అంతా ఉన్నారు. అవిటివాణ్ణి, ముసలివాణ్ణి. ఇప్పుడు నేనెవరికీ పనికి రానివాణ్ణి. నా ఉనికి వాళ్ళకి కంపరంగా వుంది. యుద్ధంలో పోయానని వార్తొచ్చింది. నా ప్రావిడెంట్ ఫండ్, నా పెన్షన్ అంతా నా భార్యకొచ్చేశాయి. పాకిస్తాన్ జైల్లో రెండేళ్ళ నరక యాతనపడి, ప్రిజ నర్స్ మార్పిడిలో ఇలా అవిటివాడిగా బైటపడ్డాను. నేనెవరి కోసం అంతటి యమ యాతనలు ఓర్చుకొని ఆత్రంగా వెళ్ళానో వాళ్ళనుండి నాకు ఆత్మీయత ప్రేమ కరువైనాయి. మొదట్లో కాస్త బాగానే చూశారంతా. తర్వాత్తర్వాత వారి సొసైటీలో నా ఉనికి వారి స్టేటస్‌కి ఇబ్బందిగా వుంది. నన్ను తండ్రిగా పరిచయం చేయడానికి వాళ్ళు చాలా ఇబ్బంది పడటం గమనించాను. చివరికి నా భార్య కూడా నన్నవమానించడానికి వెనకాళ్ళేదు. ఆ ఇంట్లో ఇక ఓ ముష్టివాడిలా బతకలేక బైటికొచ్చాను. రైఫిల్ క్లబ్‌లో షూటింగ్ నేర్పుతాను. నలుగురు పిల్లలు నాదగ్గర బెంగాలీ నేర్చుకోవడానికొస్తారు. ఇవి రెండూ నా బ్రతుకు తెరువులు. బతుకు తెరువుకై నేనేనాడు బాధపడలేదు కానీ నా ఒంటరితనానికి ఎన్నోమార్లు ఏడ్చాను కూడా. నా మొర విన్న దేవుడు కనికరించి నాకో తోడు పంపాడు. ఎవ్వరూ లేని నాకు "నేనున్నానని" తోడుగా నిలబడింది దుర్గ. అదీ మా బంధం" అన్నాడు రాజారాం దుర్గకేసి ప్రేమగా చూస్తూ.

శంకర్రావు స్థిమితంగా కూర్చున్నాడు.

"ఏమైనా పెళ్లి కావల్సిన పిల్ల. ఇలా మీ యింట్లో పని పాటా చేస్తూండటం అంత బావుండదేమో..." అంది పార్వతి.

"ఔను. నిజమే. ఏం దుర్గా! ఏం చేద్దాం! పోనీ నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అడిగారాయన.

దుర్గ పెద్దగా నవ్వి "ష్యూర్! మీరొప్పుకోవాలే గాని..." అంది.

శంకర్రావు నవ్వాడు.

"చూడు తల్లీ, దుర్గ జెమ్. ఆమెకి మంచి భర్త దొరుతాడు. దుర్గలాంటి బిడ్డను కన్న నువ్వు చాలా గొప్పదానివమ్మా" అన్నాడు రాజారాం.

పార్వతి కాస్త సేద తీరింది.

* * *

నాలుగు సంవత్సరాల తర్వాత -

దుర్గ యూనిఫారంలోనే వచ్చి "అంకుల్" అని పిలిచింది.

"స్టౌ ముందున్న రాజారాం పక్కకి చూసి - "అరెరె మై ఫెయిర్ లేడీ! జేమ్సుబాండ్! ఎప్పుడొచ్చావ్ ఊర్చుండి" ఆనందంగా చూస్తూ అడిగాడు.

"మార్నింగొచ్చాను. మీట్ మిస్టర్ చంద్రశేఖర్ ఎస్.పి." అంది దుర్గ తనపక్కనే ఓ యువకుణ్ణి చూపి.

"గ్లాడ్ టు మీట్ యు మై బోయ్! ఉడ్ బీ కదూ! కంగ్రాట్యులేషన్స్" అన్నాడు దుర్గని చూస్తూ రాజారాం.

"చంద్రం, మా అంకుల్. పాకిస్తాన్ సెల్‌లో వాళ్ళ చిత్రహింసల్ని భరించి కాళ్ళు పోగొట్టుకొని కూడా ఒక్క రహస్యం కూడా బైటపెట్టకుండా వచ్చిన వీరుడు."

గర్వంగా చూపుతూ అంది దుర్గ.

"మిమ్మల్ని కలుసుకోవటం చాలా ఆనందంగా వుది సర్. దుర్గ ఎప్పుడూ మీ మాటే తలుచుకుంటుంది." అన్నాడు చంద్రం ఆయన అందించిన చెయ్యి పట్టుకొని -

"అయితే దుర్గ ఏ.ఎస్.పి.గా, మీరు ఎస్.పి.గా ఒకేచోటుకి ట్రాన్స్‌ఫర్ అయ్యారా!"

"బహుశ వచ్చే నెలలో దుర్గ నాదగ్గరికే వస్తోంది."

"చాలా సంతోషం బాబూ."

"అంతే కాదంకుల్. ఈ నెల పదిహేనున మా పెళ్ళి. మా పెళ్ళయ్యాక మీరింక ఇక్కడుండక్కర్లేదు. మీరూ మాతో పాటే మా క్వార్టర్‌లో వుంటారు" అంది దుర్గ.

"దుర్గా" ఆశ్చర్యంగా చూశాడు రాజారాం.

"ఔను సర్. దుర్గ మాటే నా మాట. నాకెవరూ లేరు. చిన్నతనంలోనే అమ్మా నాన్నా పోయారు. నాజీవితంలో కొచ్చిన, నచ్చిన మొదటి వ్యక్తి దుర్గ. ఆ తర్వాత ఆమె ద్వారా మీరు. నాకు నచ్చిన మీ ఇద్దరూ నాతోనే ఉండాలి" కాఫీ కలపటంలో ఆయనకి సాయపడుతూ అన్నాడు చంద్రం.

దుర్గ కొద్ది దూరంలో వున్న బల్లమీద కూర్చొని ఆ ఇద్దరినీ చిరునవ్వుతో చూస్తోంది.

ఆనందంతో రాజారాంకి నోట మాటరావటం లేదు.

'నీకు నేనున్నాను' అని జీవితం మీద అనురక్తి కలిగించడానికి, తోడుగా నిలబడ్డానికి, అబ్బాయే కానక్కర్లేదు. ఆడపిల్లయితేనేం??

పూలలో సువాసన, మనిషిలో యోగ్యత దాచినా దాగవు కదా!!



## నర్తకి
## వెలపర్తి సుమలత

వరంగల్ జిల్లా 'జర్నలిస్టుల సంఘం (ప్రెస్ క్లబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, జానపద, లలిత సంగీత పోటీలలో మూడు విభాగాలలో పాల్గొని మూడు బహుమతులు, కూచిపూడిలో ప్రథమ, జానపద నృత్యంలో ప్రత్యేక, లలిత సంగీతంలో ద్వితీయ బహుమతి పొంది ఉత్తమ కళాకారిణిగా బహుమతిని అందుకొంది ప్రగతి ఉన్నత పాఠశాల, హన్మకొండలో 10వ తరగతి చదువుతున్న వెలపర్తి సుమలత. 1991 నుంచీ వరంగల్ జిల్లా ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ నిర్వహించిన పోటీలలో కూచిపూడి, జానపద, లలిత గీతాలలో ప్రతి సంవత్సరమూ బహుమతులను పొందుతోంది సుమలత.

తాడూరి రేణుక వద్ద గత మూడు సంవత్సరాలుగా నాట్యం నేర్చుకుంటున్న సుమలత 1992లో కళా రంజని (వరంగల్)వారి రాష్ట్ర స్థాయిలో జానపదనృతంలో ద్వితీయ బహుమతిని, నెహ్రూ యువ కేంద్రం వారు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలలో కూచిపూడి నృత్యంలో ద్వితీయ, బహుమతిని అందుకొంది. అలాగే కాకతీయ కళా రంజని నృత్య పోటీలలో కూచిపూడి నృత్యంలో ప్రథమ, జానపద నృత్యంలో ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. 1993లో కళా రంజని వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలలో జానపద విభాగంలో ప్రథమ బహుమతిని, లలిత సంగీతంలో తృతీయ బహుమతిని అందుకోవడమే కాకుండా ప్రతిష్ఠాత్మకమైన 'నాట్య కళారంజని' బిరుదుని కూడా తన సొంతం చేసుకొంది.

హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ప్రసారం చేసిన 'అజ్ఞానం వీడండి - జ్ఞాన జ్యోతి వెలిగించండి,' నారీ నారీ నిద్ర మేలుకో, సంక్రాంతి సంబరాలు, నృత్య రూపకాలో కూడా పాల్గొన్నది.

-గోరంటల రవికుమార్
వరంగల్